సమస్యలు పరిష్కరించాలి

బోథ్, నవంబర్ 13: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు బుధవారం ఎంఈవో కుమ్మరి పోశెట్టికి వినతి పత్రం అందజేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు వ్యతిరేకంగా పని చేస్తున్నాయని, వాటిని గుర్తించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండలాధ్యక్షుడుమున్సిఫ్, నాయకులు నరేశ్, శ్రీకాంత్ ఉన్నారు.

విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలి

బోథ్, నవంబర్ 13: విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలని ఎంఈవో కుమ్మరి పోశెట్టి సూచించారు. బుధవారం బోథ్‌లో మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాలలో రూమ్ టూ రీడ్ ఇండియా వారు ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, రూమ్ టూ రీడ్ మండల కోఆర్డినేటర్ ఆదిల్ పాల్గొన్నారు.

నేడు వడూర్‌కు ఎమ్మెల్యే రాక

భీంపూర్, నవంబర్ 13 : భీంపూర్ మండలం వడూర్ –మహారాష్ట్ర చినారి నడుమ పెన్‌గంగలో నిర్వహిస్తున్న కార్తీక పూజలకు బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ గురువారం హాజరవుతారని బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, నాయకులు సంజీవ్‌రెడ్డి, శ్రీనివాస్, దేవారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెంబి, నవంబర్ 13: పెంబి మండలంలోని అడవుల్లో పెద్దపులి సంచరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఎస్‌వో సుందర్ అన్నారు. బుధవారం గుమ్మెన కోలాంగూడ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులకు ఒంటరిగా వెళ్లవద్దని, గుంపులుగా వెళ్లాలన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలలోపు వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో గీతరాణి, ఎఫ్‌బీవో ఆడెపు కిరణ్, గంగారాం పాల్గొన్నారు.

పంటల పరిశీలన

గుడిహత్నూర్, నవంబర్13 : తోషం, మాన్కాపూర్, మర్కాగూడ గ్రామాల్లో ఆదిలాబాద్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం క్షేత్ర పర్యటన చేసి పంటలను పరిశీలించారు. టమాట, క్యాబేజీ, మిరప, వంకాయ, కంది, గోబి పంటలను పరిశీలిస్తూ రైతులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో శాస్త్రవేత్తలు డాక్టర్ రాజశేఖర్, మోహన్‌దాస్, సునీల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల సుందరీకరణకు ఆర్థిక సాయం

తలమడుగు, నవంబర్ 13: రుయ్యాడి గ్రామానికి చెందిన నక్క ధనుంజయ్ బుధవారం తనవంతుగా పాఠశాలాభివృద్ధి కోసం రూ.5 వేలు అందజేశారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులు యువకుడిని అభినందించారు.

దివ్యాంగులపై ఆదరణభావం కలిగి ఉండాలి

లక్ష్మణచాంద, నవంబర్ 13: దివ్యాంగులపై ఆదరణ భావం కలిగి ఉండాలని సీడీపీవో నాగమణి పేర్కొన్నారు. బుధవారం లక్ష్మణచాందలోని ఐకేపీ కార్యాలయంలో వరల్డ్ విజన్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో రాధిక, ఎఫ్ఆర్‌వో మధుసూదన్, ఏపీఎం వాణిశ్రీ, దివ్యాంగుల సంఘం మండలాధ్యక్షుడు గంగన్న, దివ్యాంగులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

పెంబి, నవంబర్ 13: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ బుధవారం 12 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నిల్ రెడ్డి, నాయకులు రమేశ్, మోహన్‌రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

కడెం, నవంబర్ 13: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 31 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అందజేశారు. అనంతరం కడెంలోని సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. అధికారులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

మోడల్ లైబ్రరీ ప్రారంభం

తాంసి, నవంబర్ 13: తాంసి మండలం కప్పర్ల ప్రాథమిక పాఠశాలలో రూమ్ టూ రీడ్ ఇండియా సంస్థ వారు ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని బుధవారం జిల్లా విద్యా శాఖ అధికారి ప్రణీత ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాలాభివృద్ధికి రూ.10 వేలను విరాళంగా అందించిన గ్రామస్తుడు చిలుకూరి వెంకట్ రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు,, నాయకులు, ఉపాధ్యాయులు, రూమ్ టూ రీడ్ సంస్థ సభ్యులు మహేందర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతుల భూములు బలవంతంగా సేకరించొద్దు

సోన్, నవంబర్ 13: ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోని లగచర్ల గ్రామంలో జరిగిన ఘటన రైతుల ఆగ్రహాన్ని సూచిస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొమ్మెన సురేశ్ తెలిపారు. రైతులు తమ భూములను కోల్పోవడానికి సిద్ధంగా లేరనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా గమనించాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వికారాబాద్‌లోని సోమవారం జరిగిన ఘటనకు ప్రభుత్వానిదే బాధ్యతని తెలిపారు. రంగారెడ్డి జిల్లా ముచర్ల ఫార్మసిటీపై ఎన్నికల ముందు ఇచ్చిన మాట మార్చడంతో అక్కడ కూడా ఆందోళనలు సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనతోనైనా ప్రభుత్వం భూసేకరణపై తన వైఖరిని మార్చుకొని పరిశ్రమల కోసం వ్యవసాయానికి పనికిరాని భూములను మాత్రమే సేకరించాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతులకు టోకెన్లు జారీ చేస్తున్న మార్కెట్ కమిటీ సిబ్బంది

మార్కెట్ యార్డు గేట్‌వద్ద నిలిచిపోయిన వాహనాలు

రైతులకు టోకెన్లు జారీ

ఇంద్రవెల్లి, నవంబర్ 13 : ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రంలో దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకు మార్కెట్ కమిటీ అధికారులు రైతులకు టోకెన్లు జారీ చేశారు. బుధవారం మార్కెట్ యార్డులోని సోయాబీన్ కొనుగోలు కేంద్రానికి రైతులతో పాటు పలువురు వ్యాపారులు వాహనాలతో సోయాబీన్ పంటను తీసుకువచ్చారు. దీంతో మార్కెట్ యార్డు గేట్‌వద్దనే అధికారులు వాహనాలను నిలిపివేసి రైతులకు చెందిన వాహనాలను లోనికి పంపించారు. దీంతో మండల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

రైతులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ కిరణ్ కొమ్రేవార్

లోకేశ్వరం, నవంబర్ 13 : రైతుల ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ మండిపడ్డారు. బుధవారం అబ్దుల్లాపూర్, జోహర్‌పూర్, ధర్మోరా గ్రామాల్లోని ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కోసి 40 రోజులైన కొనుగోలు చేయకపోవడం అన్యాయమన్నారు. వెంటనే కొనుగోళ్లు చేయాలని లేదంటే బీఆర్ఎస్ పార్టీ తరపున రైతుల ఉద్యమానికి మద్దతుగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిరుమని దిగంబర్, సంజీవ్, రాజారెడ్డి రైతులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ఖానాపూర్ టౌన్, నవంబర్ 13 : సంక్షేమ హాస్టళ్లలో చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో కలిసి బుధవారం ఖానాపూర్‌లో తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని ప్రతి నెల 1వ తేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్‌కార్డు, పింఛన్ అందజేయాలని కోరారు. ఇక్కడ దుర్గం లింగన్న, వరలక్ష్మి, భాగ్యలక్ష్మి, కనకదుర్గ, శాంతి ఉన్నారు.

కుమ్రం భీం కాలనీలో సర్వే చేపట్టండి

ఎదులాపురం, నవంబర్ 13 : మావల మండంలోని కుమ్రం భీం కాలనీలో నివాసముంటున్న ఆదివాసీలకు జీవో నంబర్ 18 ప్రకారం ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ అన్నారు. ఈ విషయమై బుధవారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో కలెక్టర్ రాజర్షి షాను కాలనీవాసులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ శంకర్, సోనేరావ్, రేణుక, ఇందిర ఉన్నారు.

మాతృ మరణాలను తగ్గించాలి

నిర్మల్ అర్బన్, నవంబర్ 13: నిర్మల్ జిల్లాలో మాతృ మరణాలు తగ్గించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి రాజేందర్ ఆదేశించారు. బుధవారం నిర్మల్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆశ నోడల్ అధికారులతో పర్యవేక్షణ సిబ్బందితో వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. మాతృ మరణాలను నివారించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ప్రమాదకరంగా ఉన్న గర్భిణులను గుర్తించి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. నిర్మల్ జిల్లాలో ఈనెల 12 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు జరుగనున్న సోషల్ అవేర్‌నెస్ అండ్ యాక్షన్ టూ న్యూట్రలైజ్ న్యూమోనియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

కౌలు రైతుల ఊసెత్తని ప్రభుత్వం

నేరడిగొండ, నవంబర్ 13 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో కౌలు రైతులకు సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పి మోసం చేసిందని, వారి ఊసెత్తడం లేదని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న విమర్శించారు. బుధవారం నేరడిగొండలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైన ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం కౌలు రైతులకు ఎల్ఈసీ కార్డుతో పాటు రైతు భరోసా, ఇతర సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇక్కడ మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, వివిధ గ్రామాల రైతులు ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

భైంసా, నవంబర్ 13 : కుంటాల మండలానికి చెందిన ముత్యంకు రూ. 25 వేలు, వందనకు రూ.33 వేలు సీఎం సహాయనిధి కింద మంజూరయ్యాయి. బుధవారం భైంసాలోని తన నివాసంలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు భీంరావ్, వెంగల్ రావ్ పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

ఖానాపూర్, నవంబర్ 13 : ఖానాపూర్ మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం బుధవారం హైదరాబాద్‌లోమున్సిపల్ సీడీఎంఏ అధికారిని శ్రీదేవి, సీడీఎంఏ డైరెక్టర్ శ్రీనివాసరావును వారి కార్యాలయాల్లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఖానాపూర్ మున్సిపాలిటీ విస్తరణ గతం కంటే రెట్టింపుగా పెరగడంతో పారిశుధ్య పనులు, అభివృద్ధి జరగడం లేదని పలు అంశాలతో పాటు పనుల వివరాలను వివరించారు. అనంతరం మార్కెట్‌యార్డు కమిటీ డైరెక్టర్ లక్ష్మీబాయిని కలిసి ఖానాపూర్ మార్కెట్‌యార్డులో అమృత్–2 స్కీం పథకం ద్వారా మంజూరైన వాటర్ ట్యాంకుల నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందిస్తూ నిధుల మంజూరుకు హామీ ఇచ్చారని మున్సిపల్ చైర్మన్ అన్నారు. చైర్మన్ వెంట కమిషనర్ మనోహర్, నాయకులు ఉన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

జైనథ్, నవంబర్ 13: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దీపాయిగూడ గ్రామానికి చెందిన మావురపు జీవన్(45) ఆర్థిక పరిస్థితి బాగలేక అప్పులు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలి, జీవితంపై విరక్తి చెంది ఈ నెల 12న ఉదయం 11 గంటలకు గ్రామ శివారులో పురుగుల మందు తాగి వాంతులు చేసుకున్నాడు. గమనించిన బంధువులు కుటుంబీకులకు తెలుపగా అంబులెన్స్‌లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఆత్మారాం తెలిపారు.

ఆటో దగ్ధం

లక్ష్మణచాంద, నవంబర్ 13 : గుర్తు తెలియని వ్యక్తులచే ఆటో దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో సంభవించింది. బాధితుడు బేల్కొని బాలాజీ వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో బాధితుని ఇంటి సమీపంలో నిలిపిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పంటించారు. దాంతో ఆటో పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ గంగారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమలత తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఇచ్చోడ, నవంబర్ 13: ఇచ్చోడలోని సమీర్ ట్రేడర్ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని బుధవారం కరీంనగర్ విజిలెన్స్ టీమ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నాయబ్ తహసీల్దార్ జాదవ్ రామారావ్, దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. 98 క్వింటాళ్ల బియ్యం 267 బ్యాగులు ఉన్నాయని తెలిపారు. 6ఏ కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంలో భద్రపర్చినట్లు తెలిపారు. దాడిలో విజిలెన్స్ టీం అధికారి దినేశ్ రెడ్డి, కరీంనగర్ విజిలెన్స్ టీం ఏఎస్‌వో ప్రశాంత్ రావ్ ఉన్నారు.

కార్తీక తులసీ వ్రతంలో మాజీ మంత్రి దంపతులు

పూజలు చేస్తున్న మాజీ మంత్రి దంపతులు

ఎదులాపురం, నవంబర్ 13: కార్తీక తులసీ వ్రతంలో మాజీ మంత్రి జోగు రామన్న సతీమణి రమాదేవితో కలిసి వ్రతాన్ని ఆచరించారు. వేద పండితులు ప్రవీణ్ శర్మ వేద మంత్రోచ్చారణలతో తులసీ వ్రతాన్ని ఆచరించారు.

గోదావరి ఒడ్డున మహా హారతి

బాసర, నవంబర్ 13 : కార్తీక మాస ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బాసర గోదావరి నది ఒడ్డున ఆలయ అర్చకులు, వేద పండితులు ఘనంగా జ్వాల తోరణ కార్యక్రమం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నది ఒడ్డున మహా హారతి కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విజయరామరావు, చైర్మన్ శరత్‌పాఠక్, భక్తులు పాల్గొన్నారు.

కనుల పండువగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవం


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

జైనథ్, నవంబర్ 13: జైనథ్‌లోని శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేదపండితుల మధ్య బుధవారం స్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను దంపతులు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, దేవాదాయ శాఖాధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

పాఠశాలలో అగ్ని ప్రమాదం

నిర్మల్ అర్బన్, నవంబర్ 13 : నిర్మల్‌లోని శాంతినగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండే సమయంలో గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన ఉపాధ్యాయులు అగ్ని మాపక అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పి వేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ అగ్ని ప్రమాదంలో సిలిండర్, పొయ్యి, రేకులు దగ్ధమయ్యాయని వీటి విలువ సుమారు రూ.30 వేల వరకు ఆస్తి నష్టం సంభవించిట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

పాము కాటుతో మహిళ రైతు మృతి

కుభీర్, నవంబర్ 13: పాటు కాటుతో మహిళ మృతి చెందిన ఘటన బుధవారం కుభీర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కుభీర్‌కు చెందిన బొడ్డు యశోద(40) చేనులో తన భర్త పోతన్నతో కలిసి పత్తి తీసేందుకు వెళ్లింది. పత్తి తీస్తున్న క్రమంలో కుడి కాలుకు పాము కాటు వేయడంతో భర్తకు, తోటి కూలీలకు చెప్పడంతో హుటాహుటిని వాహనంలో భైంసాలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

టిప్పర్ బోల్తా: డ్రైవర్ మృతి

ముథోల్, నవంబర్ 13 : ముథోల్‌లోని డిగ్రీ కళాశాల వద్ద బుధవారం రోడ్డుపై అదుపు తప్పి టిప్పర్ బోల్తా పడడంతో టిప్పర్ డ్రైవర్ అల్తాఫ్ (38) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సీఐ మల్లేశ్ పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని హైడ్రాలిక్ క్రేన్ తెప్పించి టిప్పర్‌ని పైకి లేపి మృతదేహాన్ని బయటకు తీశారు. టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్తతో ఉండడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జయంతిని అధికారికంగా నిర్వహించ లేదు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు సలీంపాషా

ఎదులాపురం,నవంబర్ 13 : భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని అధికారికంగా నిర్వహించలేదని అధికార పార్టీ నేతలే విలేకరుల సమావేశంలో ప్రకటించారని బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు సలీంపాషా అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోవడం లేదంటూ అధికార పార్టీ నాయకులు అసహనం వ్యక్తం చేయడం దీనికి నిదర్శనమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. మైనార్టీల సంక్షేమానికి విశేష ప్రాధాన్యతను ఇచ్చిందన్నారు. ఆ విషయం ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న నేతలకు సైతం తెలుసని అన్నారు. రూ.17 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మైనార్టీ గురుకులాలతో పాటు మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట, మైనార్టీ వ్యక్తికి ఉప ముఖ్యమంత్రితో పాటు హోంశాఖ ఇచ్చిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో కనీసం మైనార్టీలకు ఒక మంత్రిత్వ శాఖ లేకపోవడం సిగ్గుచేటని, కాంగ్రెస్ నాయకులు మైనార్టీల పట్ల మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు జాహూర్ సబ్, అబ్దుళ్ళ, అత్తరుల్లా, షాదుల్లా, జిలానీ, ఫెరోస్, ఐసన్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలి

మాట్లాడుతున్న ఆదిలాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్, నవంబర్ 13 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మహారాష్ట్రలోని పండరీపూర్‌లోని విఠలేశ్వరుని సన్నిధిని జడ్పీ మాజీ చైర్మన్ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు జడ్పీ మాజీ చైర్మన్ దంపతులకు ఘన స్వాగతం పలిలి శాలువాతో సన్మానించారు. భక్తులను ఉద్దేశించి మారుతి, తులసీ మహారాజ్‌లు హితబోధన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో కుమ్రం భీం జిల్లా ఆసిఫాబాద్ జిల్లా నుంచి పండరీపూర్‌కు పాదయాత్రగా భక్తులు వెళ్లి విఠలేశ్వరుని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో తుకారాం మహారాజ్, రాంచందర్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సర్వే పడక్బందీగా చేపట్టాలి

నార్నూర్, నవంబర్ 13 : సమగ్ర కుటుంబ సర్వేను పడక్బందీగా చేపట్టాలని ఎంపీడీవో జవహర్‌లాల్ సిబ్బందికి సూచించారు. బుధవారం తాడిహత్నూర్, గంగపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. సర్వే చేపట్టే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పులు లేకుండా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇక్కడ సిబ్బంది ఉన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు

ఎంపికైన క్రీడాకారులు

నిర్మల్ అర్బన్, నవంబర్ 13 : నిర్మల్‌లోని లక్కీ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–17 క్రికెట్ ఎంపిక పోటీలను మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై దృష్టి సారించాలని, క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రదర్శన చేపట్టి జిల్లాకు మంచి పేరును తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ రెడ్డి, స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ రవీందర్ గౌడ్, రమణారావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులు ఎంపిక

ఎదులాపురం, నవంబర్ 13 : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలీఘాడ్ జిల్లాలో ఈ నెల 25 నుంచి 29వ వరకు నిర్వహించే జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ అనిల్‌కాంబ్లే, పీడీ ప్రతాప్ తెలిపారు. గత నెల మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారులు జే రితీశ్‌నాయక్, రాథోడ్ ఆకాశ్, రాథోడ్ ప్రదీప్, పీ సంపత్ ఉత్తమ ప్రతిభకనబర్చారు. ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

భైంసా, నవంబర్ 13 : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని పట్టణ సీఐ గోపీనాథ్ అన్నారు. బుధవారం భైంసాలోని వాసవి పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ గౌస్ పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్టను దెబ్బ తీస్తే చర్యలు తప్పవు

ఎదులాపురం, నవంబర్ 13 : ఆదిలాబాద్‌లోని బెల్లూరి అయ్యప్ప ఆలయ ప్రాశస్త్యం దెబ్బతీసేలా ఆలయ కమిటీ సభ్యులపై ఎవరైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవని, భక్తులు ఎలాంటి నిరాధారణ ఆరోపణలను నమ్మరాదని బెల్లూరి ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంభోజి సూర్యకాంత్ గురుస్వామి అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తూ ఆలయ ప్రాశస్త్యాన్ని దెబ్బతీసేలా చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో సమావేశంలో గౌరవాధ్యక్షుడు దారట్ల జీవన్‌గురుస్వామి, ప్రధాన కార్యదర్శి దాముక రవీందర్‌గురుస్వామి, కోశాధికారి టీ నరేశ్, సభ్యులు మహేందర్, గౌరు లక్ష్మణ్, విజయ్ పాల్గొన్నారు.

నగదు డిపాజిట్ చేస్తుండగా చోరీ

భైంసా, నవంబర్ 13 : బ్యాంకులో నగదు డిపాజిట్ చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తి నుంచి గుర్తు తెలియని వ్యక్తులు చాకచక్యంగా రూ. 50 వేలు అపహరించిన ఘటన పట్టణంలోని ఎస్‌బీఐలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం పట్టణానికి చెందిన సురేశ్ ఈ నెల 11వ తేదీన నిర్మల్ రోడ్డులోని ఎస్‌బీఐలో రూ. 90 వేలు డిపాజిట్ చేసేందుకు ఫాం నింపుతున్న క్రమంలో డబ్బు ఉన్న బ్యాగ్ (ప్లాస్టిక్ కవర్) ను బ్లేడ్ లాంటి వస్తువుతో కత్తిరించి నగదు అపహరించారు. కొద్ది సేపటికి సురేశ్ బ్యాగ్ చూడగా అందులో నుంచి రూ. 50 వేలు కనిపించకపోవడంతో అవాక్కయ్యాడు. బ్యాంకు సీసీ ఫుటేజీని పరిశీలించగా ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా తిరిగిన దృశ్యాలు నమోదైనట్లు బాధితుడు తెలిపాడు. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు.

గోదావరి వద్ద మృతదేహం లభ్యం

బాసర, నవంబర్ 13 : బాసర గోదావరి నది వద్ద బుధవారం మృతదేహం లభ్యమైంది. ఈ మృతదేహం నిర్మల్ జిల్లాలోని సిద్దూర్ గ్రామానికి చెందిన రాజు(35)గా పోలీసులు గుర్తించారు. వివరాల ప్రకారం... రాజు సోమవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు వెతకగా ఆచూకీ దొరకలేదు. అయితే బాసర గోదావరి బ్రిడ్జి వద్ద రాజు బైకు, పర్సు కనిపించడంతో నదిలో వెతికించగా మృతదేహం లభ్యమైంది. ఇది రాజు మృతదేహంగా గుర్తించారు.

తుడుందెబ్బ మహాసభను విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి, నవంబర్ 13: ఉట్నూర్‌లోని ఆదివాసీ భవనంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించే తుడుందెబ్బ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపురావ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని రాధాకృష్ణ మందిరం ఆవరణలో తుడుందెబ్బ, గోండ్వానా రాయిసెంటర్ల సార్‌మేడిలు, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుడుందెబ్బ జిల్లా మహాసభకు కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గోండ్వానా రాయిసెంటర్ల సార్‌మేడిలు మెస్రం దుర్గు, మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, చిన్నుపటేల్, కోట్నాక్ దేవ్ షావ్, జుగాదిరావ్, ఆదివాసీ పెద్దలు , తుడుందెబ్బ మండలాధ్యక్షుడు పుర్కా చిత్రు, ఆదివాసీ గిరిజన సమన్వయ కర్త బారిక్‌రావ్, తుడుందెబ్బ మాజీ మండలాధ్యక్షుడు నాగ్‌నాథ్, గౌరవాధ్యక్షుడు భరత్, జిల్లా ఉపాధ్యక్షుడు భరత్, ప్రధానకార్యదర్శి రాందాస్ పాల్గొన్నారు.

ఢిల్లీకి బయలుదేరిన కళాకారుల బృందం

ఇచ్చోడ, నవంబర్ 13 : దుబార్‌పేట్ గ్రామానికి చెందిన ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ ప్రముఖ ఆదివాసీ కళాకారుడు కాత్లే శ్రీధర్ బృందం బుధవారం ఢిల్లీకు బయలుదేరి వెళ్లారు. ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ఈ నెల 13 నుంచి 15 వరకు స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సాముండా జయంతి కార్యక్రమంలో నృత్యాలతో అలరించడానికి ఆదివాసీ సకల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం కార్యదర్శి కాత్లే ఆనంద్, సభ్యులు చిట్టిబాబు, శాంతకుమారి పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్‌కు విఫల యత్నం

కుభీర్, నవంబర్ 13 : కుభీర్‌లోని బస్టాండ్ ప్రాంతంలో దోడర్న (రాంనాయక్ తండా)ఏహెచ్ఎస్‌లో ఏఎన్ఎంగా పని చేసే లలిత మెడలోని బంగారు గొలుసును ఎత్తుకెళ్లేందుకు విఫలయత్నం చేసి గుర్తు తెలియని చైన్‌స్నాచర్స్ పారిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు. నంబర్ ప్లేటు లేని బైకుపై ఇద్దరు ఆగంతకులు వచ్చి సదరు మహిళ మెడలోని బంగారు గొలుసును పట్టి లాగారు. గొలుసుకు బదులు వారి చేతికిచున్నీ రావడంతో మహిళ కింద పడిపోగానే బైకు వేగం పెంచి పారిపోతూ మరో ఒక వ్యక్తి చేతిలోని సెల్ ఫోన్‌ను ఎత్తుకెళ్లారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన
తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ–వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీసులు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది. మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను ''ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రీకోర్స్ పద్ధతి లేని విధంగా'' తేది: **25 నవంబర్, 2024న మ|| 12.30 గం. నుండి మ|| 3.30 గం. మధ్య** (ఇ–వేలం సమయం) ఇ–వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది. **రుణగ్రహీతలు మరియు బకాయి మొత్తం వివరాలు:**

క్ర.సం.	బ్రాంచ్ పేరు	రుణ A/c నెం.	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీస్ తేది	స్థూల బరువు	నికర బరువు
1	ఆర్మూర్ NIZA TG	xxxxxxxxxxxxx6520	మహమ్మద్ ముజాహిద్	136905	24–సెప్టెంబర్–24	32.5	28.8
2	ఆర్మూర్ NIZA TG	xxxxxxxxxxxxx4978	యరవత్రి గణిత	116053	24–సెప్టెంబర్–24	26.3	20.7
3	బోధన్ C0971 TG	xxxxxxxxxxxxx2129	మహమ్మద్ ముద్దసిర్ అహ్మద్	65338	30–జూలై–24	19	15.5
4	నిజామాబాద్	xxxxxxxxxxxxx5187	బంటు రవళి	89906	26–ఆగస్టు–24	19.3	18.2
5	కామారెడ్డి	xxxxxxxxxxxx5174	గోకని రవీందర్ గౌడ్	237917	25–అక్టోబర్–24	52.9	48.5
6	ఆదిలాబాద్	xxxxxxxxxxxx1738	సోమా లక్ష్మి	47843	24–సెప్టెంబర్–24	9.99	9.79
7	నిర్మల్ TG	xxxxxxxxxxxxx5640	సల్లంగుల సుమంత్	105439	01–అక్టోబర్–24	27	25
8	బోధన్ C0971 TG	xxxxxxxxxxxx7334	మూద్ బాలసంగ్రం	150680	07–జూన్–24	25.5	24.7
9	బోధన్ C0971 TG	xxxxxxxxxxxx0620	సింగారపు రోహిత్ గుప్త	501553	25–అక్టోబర్–24	108.4	100.57

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌కు అధారిటీ కలదు. వేలం ఆన్‌లైన్‌లో **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)లో **మ|| 12.30 గం. నుండి మ|| 3.30 గం.** మధ్య నిర్వహించబడును. సవివరమైన నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)కు లాగిన్ కావలెను.

అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్.

మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక కమిటీ

ఎదులాపురం, నవంబర్ 13: మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నగదును స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక జిల్లా అధికారుల కమిటీని నియమించినట్లు బుధవారం కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జిల్లాలో నగదు స్వాధీనంపై ప్రత్యేకాధికారుల కమిటీలో జడ్పీ సీఈవో జితేందర్, జిల్లా సహకార అధికారి బీ మోహన్, జిల్లా ట్రెజరీ అధికారి, కన్వీనర్ హారిక, జిల్లా ఎన్నికల అధికారులను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు, ఆధారాలు లేకుండా నగదును తరలించే క్రమంలో అధికారులు స్వాధీనం చేసుకుంటే కమిటీ సభ్యులు బీ మోహన్‌ను సంప్రదించాలని సూచించారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తరలిస్తే సరైన ఆధారాలు నగదు స్వాధీన పంచనామా పత్రాన్ని చూపించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం పక్క రాష్ట్రమైన మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నందున, తెలంగాణ సరిహద్దు జిల్లా అయిన ఆదిలాబాద్ సరిహద్దు వద్ద నిఘా బృందం మోహరించినట్లు పేర్కొన్నారు.

పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

ఎదులాపురం, నవంబర్ 13 : టీజీపీఎస్సీ గ్రూప్–3 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. బుధవారం టీజీపీఎస్సీ గ్రూప్–3, ధాన్యం కొనుగోలు, పత్తి కొనుగోలు, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలపై హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ నెల 17, 18వ తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరిగే పరీక్షలో ఉదయం 9.30 గంటలకు పరీక్షా కేంద్రం గేట్లు మూసివేయడం జరుగుతుందని, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు జరిగే పరీక్షలో పరీక్షా కేంద్రం గేట్లు మధ్యాహ్నం 2.30 గంటలకు మూసివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30 గంటల వరకు చేరుకోవాలని, సమయం దాటిన తర్వాత కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్–3 పరీక్షల కోసం జిల్లాలో మొత్తం 29 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్, ట్రైనీ కలెక్టర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భారత్ పెట్రోల్ బంక్ తనిఖీ

దస్తురాబాద్, నవంబర్ 13 : మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్‌ను బుధవారం ఆ సంస్థ అధికారులు తనిఖీ చేశారు. బంక్ పరిసరాలను, తూనికల, తదితర వాటిని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వినియోగదారులకు ఆఫర్‌తో కూడిన ఇంజన్ ఆయిల్ డబ్బాలను అందజేశారు. ఇక్కడ టీఎం మేనేజర్ శ్రావణ్ కుమార్, టీసీ జితిన్, సేల్స్ అధికారి రితేశ్, ఇంజినీర్ అరుణ్, ఎఫ్ఎస్ఏ వినాయక్, బంక్ నిర్వాహకులు మనోహర్ ఉన్నారు.